వెలమల్లారా.. మిమ్మల్ని చంపి తీరుతాం!

- పక్కాగా పనిపడతాం.. నేనే భౌతికదాడులకు దిగుతా..
- పరుషపదజాలంతో దూషించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్
- సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన వీడియో
- తీవ్రంగా ఖండించిన ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్
- దోమలగూడ పీఎస్‌లో ఎమ్మెల్యే శంకర్‌పై ఐవా ఫిర్యాదు
- ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్
- సీఎం రేవంత్, కాంగ్రెస్ బాధ్యతవహించాలని హెచ్చరిక

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై దోమలగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన వెలమసంఘం ప్రతినిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమ సామాజికవర్గంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. వెలమలపై పరుష పదజాలంతో దూషించారు. శంకర్ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా వెలమ సామాజికవర్గం భగ్గుమంటున్నది. తమ కులంపై పరుషంగా మాట్లాడిన శంకర్‌ను వెంటనే ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ (ఐవా) డిమాండ్ చేసింది. వెలమ సామాజికవర్గంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యల వీడియో శుక్రవారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో శాసనసభ్యుడుగా తన హోదాను మరిచి ఒక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు ఉన్నాయంటూ ఐవా మండిపడింది. ఈ వీడియోలో 'వెలమల్లారా.. మిమ్మల్ని చంపి తీరుతాం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియకుండా వెలమల అంతు చూస్తాం.. కాంగ్రెస్‌లో బలమైన నాయకులం ఉన్నాం.. మేము బయటకొస్తే ఒక్కొక్కరి వీపు విమానాల మోత మోగుతాయి. వెలమల పని పక్కా పడతం.. ఇంకా ఎక్కువ చేస్తే.. డైరెక్ట్‌గా చెప్తున్నా.. షాద్‌నగర్ ఎమ్మెల్యేగా.. నేనే డైరెక్ట్‌గా వెలమలపై భౌతికదాడులకు దిగుతా.. ' అంటూ ఎమ్మెల్యే శంకర్ హెచ్చరికలు జారీచేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఆల్‌ఇండియా వెలమ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం.. దోమలగూడ పీఎస్‌లో శంకర్‌పై ఫిర్యాదు చేశారు. శంకర్‌పై చట్టపరమైన విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శంకర్‌పై అనర్హత వేటు వేయాలి : ఐవా డిమాండ్

బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన శంకర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని, ఆయనపై అనర్హత వేటువేయాలని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ డిమాండ్ చేసింది. హిమాయత్‌నగర్‌లోని ఐవా కార్యాలయంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు నీలగిరి దివాకర్ రావు, తాండ్ర శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ వాడిన భాష వల్ల వెలమ సామాజికవర్గానికి చెందిన తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే కేవలం తమ కులాన్ని అవమానించినట్టుగా భావించడం లేదని, ఇది తాను చేసిన ప్రమాణాన్ని అవమానించేనట్టేనని పేర్కొన్నారు. ఇటువంటి వ్యక్తికి చట్టసభల్లో ఉండే అర్హత లేదని, ఆయనను వెంటనే ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వెలమకులాన్ని తిట్టడం ఫ్యాషన్ అయిందని, తమ కులం చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. 'ఎమ్మెల్యేగా ఉండి ఏదైనా మాట్లాడొచ్చా? చంపుతామనే భాష ఏమిటి? రౌడీయిజం చేస్తున్నాడా? రాజకీయం చేస్తున్నాడా?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర డీజీపీ తక్షణమే శంకర్ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెలమ ప్రజాప్రతినిధులు శంకర్ వ్యవహారాన్ని చూస్తూ ఊరుకుంటారా? మీ సహచర ఎమ్మెల్యే మీ ప్రాణాలు తీసినా తీయొచ్చు.. దీనిపై సీఎంను, హైకమాండ్‌ను వెలమ ప్రజాప్రతినిధులు నిలదీయాలి' అని సూచించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ సిగ్గుతో తలవంచుకోవాలని, ఇంతటి సంస్కారహీనుడు రాజకీయాలకు పనికిరాడని మండి పడ్డారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే తమ కార్యాచరణ ఖచ్చితంగా ఉంటుందని ఐవా హెచ్చరించింది. సమావేశంలో కోశాధికారి హరీశ్ చేప్యాలతోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్థాయికి తగని వ్యాఖ్యలు: కవిత

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): వెలమ సామాజికవర్గాన్ని కించపరుస్తూ షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలు ఒక ప్రజాప్రతినిధి స్థాయికి తగదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హితవు పలికారు. ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అధికారిక వైఖరా? అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలియజేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 6 : వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపెల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని వెలమ సంక్షేమ మండలి జగిత్యాల శాఖ నాయకులు శనివారం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుత ఎమ్మెల్యే పదవిలో ఉండి వెలమ కులస్తుల అంతు చూస్తామని బెదిరించడం, అసభ్యపదజాలంతో దూషించి మనోభావాలను గాయపర్చారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెలమ సంక్షేమ మండలి ప్రతినిధులు ఐల్నేని సాగర్ రావు, వేణుగోపాల్‌రావు, వీ కృష్ణారావు, పురుషోత్తంరావు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పిల్లర్ల మధ్యలో విద్యార్థిని తల ఇరుక్కుపోవడంతో బయటకు తీసేందుకు యత్నిస్తున్న ఉపాధ్యాయురాలు, మేస్త్రీ

పిల్లర్ల మధ్య ఇరుక్కున్న విద్యార్థి

- అచ్చంపేట మండలం పుల్జాల బడిలో ఘటన

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 6: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం పుల్జాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినికి పెను ప్రమాదం తప్పింది. పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న సరిత శుక్రవారం ఉదయం ఇంటర్‌వెల్ సమయంలో ఆడుకుంటూ భవనానికి ఉన్న రెండు పిల్లర్ల మధ్య తల పెట్టడంతో ఇరుక్కుపోయింది. తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు, భవన నిర్మాణ మేస్త్రీలు శ్రమించి పిల్లర్లను కొంత మేర ధ్వంసం చేసి విద్యార్థినిని సురక్షితంగా బయటకు తీశారు.

రాష్ట్రంలో మరో సర్వే!

- త్వరలో ప్రజల ఇండ్ల లెక్కింపు
- మున్సిపల్ సిబ్బందిపై ఇంకో భారం
- సర్వేలకే పరిమితమైన సిబ్బంది
- నత్తనడకన ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో సర్వే మొదలుకానున్నది. ప్రజలకు సొంత ఇండ్లు, అద్దె ఇండ్లు ఎన్ని ఉన్నాయో లెక్కలు తీసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సర్వే బాధ్యతలను రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి అప్పగించనున్నది. ఇప్పటికే కులగణన సర్వే చేయించి పీకల్లోతు పనిభారం పెంచారని మున్సిపల్ సిబ్బంది నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా తొమ్మిది రోజుల విజయోత్సవాల పేరిట రోజూ వారి పనులకు గండికొట్టారని, ఇది చాలదన్నట్టుగా మరో కొత్త రకమైన సర్వే తెరపైకి తెచ్చారని ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మరోవైపు ప్రభుత్వం సర్వేల మీద సర్వేలు నిర్వహిస్తే.. ఇక ప్రజల సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 5 లక్షల మంది పేదలకు ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. అందులో భాగంగానే సర్వే చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌పై సర్వేల ప్రభావం..

రాష్ట్రంలో భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లపై వరుస సర్వేల ప్రభావం పడింది. దీంతో అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతున్నది. ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా ఫీజు చెల్లించడానికి ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో 142 మున్సిపాలిటీలకు చెందిన సిబ్బంది కూడా బిజీగా ఉండటం ఈ ఆలస్యానికి కారణమని తెలుస్తుంది. అయితే, రెగ్యులర్ పనులకు ఆటంకం కలిగించే సర్వేల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని మున్సిపాలిటీ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మున్సిపాలిటీ కమిషనర్లు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. సర్వేపై ఆదేశాలు వచ్చిన తర్వాత తమ స్పందిస్తామని మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు.

మంత్రి ఆదేశాలు..కాంగ్రెస్ కార్యకర్తపై థర్డ్ డిగ్రీ

- కాంగ్రెస్ నాయకులను కొట్టిన పోలీసులు
- యూత్ కాంగ్రెస్ వరంగల్ అధ్యక్షుడిగా మంత్రి సురేఖ అనుచరుడి ఓటమి
- ఎమ్మెల్సీ సారయ్య అనుచరుడికి మద్దతు ఇచ్చిన వారికి వేధింపులు
- సీపీకి సారయ్య ఫిర్యాదు

వరంగల్, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజాపాలనగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలతోపాటు మంత్రులకు, ఎమ్మెల్యేలకు నచ్చని కాంగ్రెస్ నాయకులపైనా పోలీసుల వేధింపులు కొనసాగుతున్నాయి. ఇటీవల వచ్చిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వరంగల్ జిల్లా అధికార పార్టీలో మరోసారి చిచ్చురేపాయి. వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేసిన మంత్రి కొండా సురేఖ అనుచరుడు బత్తిని అఖిల్‌పై ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అనుచరుడు పరమేశ్వర్ మూడు వేల ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. పరమేశ్వర్ గెలుపు సందర్భాన్ని వాట్సాప్‌లో పోస్టు చేశారనే కారణంతో అధికార పార్టీ కార్యకర్తలను పోలీసులతో కొట్టించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జూపల్లి వెంకటరత్నం అకారణంగా కాంగ్రెస్ కార్యకర్తలను అర్ధరాత్రి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కొట్టారని ఎమ్మెల్సీ సారయ్య వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝాకు ఫిర్యాదు చేశారు. యూత్ కాంగ్రెస్ ఎన్నిక ఫలితాలపై వాట్సాప్‌లో పోస్టు చేస్తే పోలీసులు కొట్టడం ఏమిటిని ప్రశ్నించారు. బాధితుడి పెండ్లి ఆదివారం ఉన్నదని చెప్పినా వినకుండా అర్ధరాత్రి అకారణంగా కొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు నెలల క్రితం వరంగల్‌లోని ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి కొట్టారని గుర్తచేశారు. వరంగల్ నగరంలో రౌడీలకు పోలీసులు సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

ఏడాది బర్బాది గురుకులం

గాడి తప్పి.. రోడ్డున పడ్డ విద్యార్థుల గోస పట్టని పాలకులు

- ప్రత్యేకంగా మంత్రి లేక అధ్వానంగా నిర్వహణ
- ఇష్టారాజ్యంగా ఉన్నతాధికారుల నిర్ణయాలు
- నరకం చూస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పిల్లల భవితవ్యంపై ఆందోళనలో తల్లిదండ్రులు

రాష్ట్రంలో గురుకుల, సంక్షేమ పాఠశాలలు అధ్వానంగా తయారయ్యాయి. ప్రభుత్వ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ఏడాదిలోనే గురుకులాల పరిస్థితి దారుణంగా మారింది. ప్రభుత్వంలో సంబంధిత శాఖలకు మంత్రి లేకపోవడంతో కొందరు అధికారులు ఆడింది ఆటగా నిర్వహణ సాగుతున్నది. అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆగం చేస్తున్నాయి. అడ్డగోలు విధానాలతో గందరగోళంగా మారిన గురుకులాల్లో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయే దుస్థితి నెలకొన్నది. కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడగా మరికొందరు ఆహారం కలుషితమై మృతి చెందారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ గురుకుల వసతి గృహంలో ఏ వార్త వినాల్సి వస్తుందో అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పేదలకు మెరుగైన విద్య అందించాల్సిన పాఠశాలలు విద్యార్థులను పొట్టన పెట్టుకుంటున్నాయి.

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ):

నాడు ఖ్యాతి.. నేడు దుస్థితి

బీఆర్ఎస్ హయాంలో గురుకుల విద్యాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకులాల్లో విద్యాబోధన చేసింది. తెలంగాణ గురుకులాలు దేశానికి దిక్సూచిగా మారాయి. పిల్లలను గురుకుల, సంక్షేమ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు పోటీపడ్డారు. కానీ కాంగ్రెస్ ఏడాది పాలనలో గురుకులాలు గాడితప్పాయి. అన్నమో రామచంద్రా అంటూ విద్యార్థులు రోడ్డెక్కితే.. "మీకు తిండి పెట్టేందుకు ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వలేదు"అని అధికారులు చిన్నారులను చీత్కరించుకున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. సాంఘిక సంక్షేమ, మైనారిటీ, గిరిజన సంక్షేమశాఖలకు ప్రత్యేకంగా మంత్రి కూడా లేరంటే ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటి ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ శాఖలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి వద్దనే ఉండటం, పర్యవేక్షణ లేకపోవడం, విధాన నిర్ణయాల్లో ఆలస్యంతో సమస్యలు నెలకొన్నాయి. బీసీ సంక్షేమ గురుకులాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నా తాను పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

కుర్చీలకు అతుక్కుపోయిన పెద్ద సార్లు, మేడమ్‌లు!

సొసైటీల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలకు వెళ్లడం కరువైంది. నెలలో రెండుసార్లయినా గురుకులాలను సందర్శిస్తూ, విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ, సమీక్షలు నిర్వహించాలి. కానీ ఏడాదిగా సొసైటీల పెద్దసార్లు, మేడమ్‌లు చాలామంది ప్రధాన కార్యాలయాలు దాటడం లేదు. ప్రజాప్రతినిధులు నిర్వహించే కార్యక్రమాల్లో మాత్రం తళుక్కున మెరిసి మాయమవుతున్నారని, గురుకులాలపై దృష్టిపెట్టడం లేదని సొసైటీ ఉద్యోగులు కూడా మండిపడుతున్నారు. మంత్రి లేకపోవడంతో ఉన్నతాధికారులు ఎవరికి వారే బాసులుగా ఫీలవుతూ జులుం ప్రదర్శిస్తున్నారని చెప్తున్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు నష్టం

గురుకులాలు, సంక్షేమ పాఠశాలల్లో కలుషితాహారంతో విద్యార్థుల మృతి, ఆత్మహత్యలు, అనుమానాస్పద మరణాలకు సంబంధితశాఖ పర్యవేక్షణ లేకపోవడమే కారణమని విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతలేని సరుకులు సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గురుకులాల్లో పని వేళలను మార్చడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్తున్నారు. బోధనకు సంబంధం లేని పనుల బాధ్యతలను తమకు అప్పగించడంపై టీచింగ్‌పై ఏకాగ్రత పెట్టలేకపోతున్నామని ఉపాధ్యాయులు చెప్తున్నారు. విద్యార్థులతో పాటు తాము కూడా ఒత్తిడికి గురవుతున్నామని వాపోతున్నారు.

విద్యార్థులు చచ్చినా పట్టించుకోరా?

గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వ పెద్దలు, మంత్రుల నుంచి కనీస స్పందన లేదని మండిపడుతున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు నామమాత్రపు విచారణకు ఆదేశించడంతో సరిపెట్టకుండా సమస్యకు మూల కారణాలు తెలుసుకుని, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు విచారణ జరిపిన కమిటీల నివేదికలు ఏమయ్యాయో ప్రభుత్వం చెప్పాలని నిలదీస్తున్నారు. ఎవరి ఒత్తిడితో నివేదికలను బయటకు రాకుండా చూస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం గురుకులాల్లో ఘటనలపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు

8	4	4
ఎస్సీ గురుకులాలు	మోడల్ స్కూళ్లు	కస్తూర్బా పాఠశాలలు

బీసీ సంక్షేమ పాఠశాలలు	3
ఎస్టీ గురుకులాలు	1
మైనారిటీ గురుకులాలు	1
సంక్షేమ హాస్టళ్లు	2

ఫుడ్‌పాయిజన్ మృతులు	4	అనారోగ్యంతో మరణాలు	13
		అనుమానాస్పద మరణాలు	8

అడుగుపెడితే అరెస్టే

మొదటిపేజీ తరువాయి...

జరిగితే, దానిని పట్టుకుని రాద్ధాంతం చేస్తున్నారని, బీఆర్ఎస్ నేతల ఆందోళన వల్ల గురుకులాల్లో పనిచేసేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. ఇకపై అనుమతిలేకుండా ఎవరైనా గురుకులాలకు వెళ్తే క్రిమినల్ కేసులు పెట్టడమేగాక, అవసరమైతే అరెస్టు చేయిస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఆమె మాసబ్‌ట్యాంక్‌లోని సొసైటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సొసైటీల్లో జరుగుతున్న వరుస పుడ్‌పాయిజన్, ఆత్మహత్యల సంఘటనలపై వివరణ ఇచ్చారు.

వచ్చే వరకూ అన్నం తినకండి

ఇటీవల సొసైటీలోని గురుకులాల్లో రెండు చోట్ల పుడ్‌పాయిజన్ జరిగిందని, బయటి నుంచి వచ్చిన ఆహారపదార్థాల వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని వర్షిణి తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు పచ్చళ్లు పెట్టి పంపుతున్నారని, వాటివల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. బయటి నుంచి, లేదంటే ఇండ్లకు వెళ్లి వచ్చిన అనంతరమే, సదరు విద్యార్థులే పుడ్‌పాయిజన్‌కు గురవుతున్నారని పేర్కొన్నారు. పుడ్‌పాయిజన్‌ను నివారించేందుకు సొసైటీ తరపున అనేక చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఎక్కడయినా గురుకులంలో భోజనం సరిగా లేకపోతే, తనకు నేరుగా ఫోన్ చేయాలని, మెసేజ్ పంపాలని, వీలైతే మెయిల్ చేయాలని, అంతే కాకుండా తాను వచ్చే వరకూ తినబోమని సొసైటీ సిబ్బందికి చెప్పాలని విద్యార్థులకు సైతం సూచించానని వర్షిణి వెల్లడించారు. కూరగాయలు తరలించేందుకు కంటెయినర్లు కొనుగోలు చేయాలని, శుభ్రమైన ప్రదేశాల్లో వంటలు చేయాలని, కుకింగ్ సిబ్బంది యూనిఫామ్స్, గ్లౌజ్, క్యాప్ పెట్టుకోవడం తప్పనిసరి చేశామని, ఆ జాగ్రత్తలు తప్పక పాటించాలని ఆదేశాలు జారీ చేశామని వివరించారు.

బీఆర్ఎస్ ఆందోళనలు సిగ్గుచేటు

ఎక్కడో ఒక చోట చిన్నపాటి సంఘటనలు జరిగినా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, బీఆర్ఎస్ నేతల విమర్శలు ఎక్కువయ్యాయని, సలహాలివ్వాలి కానీ విమర్శలు చేయొద్దని వర్షిణీ పేర్కొన్నారు. ఏమైనా చెప్పాలంటే అసెంబ్లీలో, లేదంటే సీఎస్, అధికారులను కలిసి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్, పార్టీల నేతలు అలోచించి ఆందోళనలు చేయాలని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన టీచర్లే ఇప్పుడూ పనిచేస్తున్నారని, రేపు బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చినా కూడా వారే ఉంటారని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌ను రాజకీయాలకు వాడుకోవద్దని, ప్రతిపక్ష పార్టీల నేతలు చేస్తున్న ఆరోపణలకు, ఆందోనళలతో టీచర్లు పనిచేయడానికి భయపడుతున్నారని తెలిపారు. గతంలో గురుకులాల గురించి చాలా గొప్పగా చెప్పానని, ఇప్పుడు చెప్పలేకపోతున్నానని, బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలను చూస్తే సిగ్గుగా ఉన్నదని వ్యాఖ్యానించారు. రాజకీయాల కోసం తమను ఫుట్‌బాల్‌గా వాడవద్దని ప్రతిపక్షనేతలకు విజ్ఞప్తి చేశారు.

5వ తరగతి ప్రవేశాలకు 18న నోటిఫికేషన్

గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నదని వర్షిణి వెల్లడించారు. 45 రోజులపాటు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుందని, ఆన్‌లైన్ ద్వారా ఇంటి నుంచి, లేదంటే జోనల్ ఆఫీస్‌లకు వెళ్లి అడ్మిషన్ పొందవచ్చని ప్రత్యేకంగా అందుకోసం వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియను మరింత సరళతరం చేశామని, కులం, ఆదాయం, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఉంటే సరిపోతాయని స్పష్టంచేశారు. కులం సర్టిఫికెట్ నంబర్ ఎంట్రీ చేయగానే అన్నివివరాలు స్వయంచాలకంగా నమోదవుతాయని వివరించారు. 2024 జనవరి 1 నుంచి తీసుకున్న సర్టిఫికెట్లే చెల్లుబాటవుతాయని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 23న రాతపరీక్ష నిర్వహించి, జూన్ 12లోగా అడ్మిషన్ ప్రక్రియను పూర్తిచేయాలనే లక్ష్యంతో సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన పరీక్షను ఈ ఏడాది నుంచి రద్దు చేస్తున్నామని, పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే నేరుగా సొసైటీ జూనియర్ కాలేజీల్లో ప్రవేశం పొందవచ్చని వెల్లడించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకి సంబంధించి కూడా అదే విధానాన్ని ప్రవేశపెడతామని, పదో తరగతిలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన సొసైటీ విద్యార్థులకే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ సక్రునాయక్, సొసైటీ అధికారులు అనంతలక్ష్మి, శారద, పలువురు జోనల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'నమస్తే తెలంగాణ'ను పట్టించుకోం

మీడియా సమావేశం సందర్భంగా ఇప్పటివరకు సొసైటీలో జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు, పుడ్‌పాయిజన్ అంశాలపై ఎలాంటి విచారణ చేశారు? అందుకు సంబంధించిన నివేదికల వివరాలేమిటని 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించగా.. సొసైటీ సెక్రటరీ వర్షిణి ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థుల సంక్షేమానికి గతంలో నుంచి అమలుచేస్తున్న అంశాలనే ఏకరువు పెట్టారు తప్ప అసలు ప్రశ్నలకు బదులివ్వలేదు. కొందరు విలేకరులు కావాలనే తప్పుడు రాతలు రాస్తున్నారని, సొసైటీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎదురుదాడికి దిగారు. అక్కడితో ఆగకుండా 'నమస్తే తెలంగాణ'ను పరిగణనలోకి తీసుకోబోమని, ఏమైనా రాసుకోవచ్చని వర్షిణి పేర్కొనడం గమనార్హం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఆశ్రమ పాఠశాల ఎదుట బీఆర్ఎస్వీ నిరసన

ఇల్లెందులో గిరిజన బాలికల పాఠశాలలోకి అనుమతించని అధికారులు

ఇల్లెందు, డిసెంబర్ 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గురుకులబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకున్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎన్ఎన్ రాజు ఆధ్వర్యంలో జిల్లా మహిళా నాయకులు సింధు, తపస్విని లోపలికి వెళ్లనీయకపోవడంతో పాఠశాల గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు అనారోగ్యం పాలై మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు తెలుసుకోవడానికి వెళితే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు గిన్నారపు రాజేశ్, సత్తాల హరికృష్ణ, రాహుల్ గౌడ్, అఖిల్, మహర్షి, వినయ్